డిటెక్టివ్ స్టోరీ

# కుర్చీ ఏడుపయితే

- ఎం. ఉదయభాను

అర్ధరాత్రి వేళ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో బిజీగా ఉన్నాడు ఎస్ఐ ధనుంజయ్. అలాంటి సమయంలో అతని సెల్ మ్రోగింది. విసుగ్గా సెల్ ఆన్ చేసేడు.

ఫోన్‌లో ఎవరిదో ఏడుపు వినిపిస్తోంది.

''సార్...మా అయ్యగారు పోయారు....'' అన్న మగ స్వరం వినిపించింది.

ధనుంజయ్ విసుగ్గా ''పోయారంటున్నావు.... ఎక్కడికెళ్ళారు... ఇంతకీ నువ్వెవరూ... మీ అయ్యగారి పేరేమిటి...?'' అంటూ అడిగాడు.

''అయ్యగారి పేరు మాధవరావు...నేను వాళ్ళింట్లో నౌకర్‌ని లింగయ్య...'' అని చెప్పాడు ఫోన్‌లో అవతలి నుంచి.

మాధవరావు పేరు వింటూనే అలర్ట్ అయ్యాడు ధనుంజయ్. ''ఏ మాధరావు గురించి నువ్వు చెప్పేది బిజినెస్ మెన్ మాధవరావా? లేక సినిమా నిర్మాత మాధవరావా...?'' అంటూ అడిగాడు.

''బిజినెస్ మెన్ మాధవరావు గురించే నే చెబుతోంది...''

''ఇంటి అడ్రస్ చెప్పు....''

''డోర్ నెం:49, రోడ్ నెం:3, బంజారాహిల్స్....'' అని చెప్పి ఫోన్ కట్ చేసాడు లింగం.

క్షణం ఆలస్యం చేయకుండా తన అసిస్టెంట్ వెంకట్‌ని మరో ఇద్దరు కానిస్టేబుల్స్‌ని తీసుకొని జీపులో బంజారాహిల్స్ బయలుదేరాడు ఎస్ఐ ధనుంజయ్.

పదినిమిషాల్లో మాధవరావు ఇంటి ముందు ఆగింది జీపు. బిల్డింగ్‌లో లైట్లు వెలుగుతున్నాయి.

అప్పటికే కొంత మంది జనం అక్కడ గుమిగూడి ఉన్నారు. పోలీసుల్ని చూస్తూనే తప్పుకొని దారి ఇచ్చారు.

***

ఇంట్లోకి అడుగుపెడుతూనే నౌకరు లింగయ్య ఎదురొచ్చాడు. ''ఇటు రండి సార్...'' అంటూ మాధవరావ్ ఆఫీసు గదిలోకి తీసుకెళ్ళాడు.

ఆఫీసు చెయిర్‌లోనే ప్రాణాలొదిలాడు మాధవరావు. పక్కనే ఉన్న కంప్యూటర్ స్క్రీన్ పై సూసైడ్ నోట్ కనిపిస్తోంది.

''నా చావుకు ఎవ్వరూ బాధ్యులు కారు...మాధవరావు'' అని ఉంది.

రివాల్వర్‌తో కుడికణత మీద బ్లాంక్ పాయింట్‌తో కాల్చుకున్నాడు.

గదినంతా నిశితంగా పరిశీలించాడు ఎస్ఐ ధనుంజయ్. టేబుల్ మీద ఆఫీసు కాగితాలు, పెన్ స్టాండ్‌లో పెన్ను, ఇతర ఫైళ్ళు యధాతథంగా ఉన్నాయి.

ధనుంజయ్ అసిస్టెంట్ వెంకట్ మాధవరావు శవాన్ని వివిధ భంగిమల్లో ఫోటోలు తీయించాడు.

పక్కగదిలో ఆడవాళ్ళు వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. ధనుంజయ్ ఆ గదిలోకి వెళ్ళగానే నౌకర్ లింగం ఆడవాళ్ళను పరిచయం చేసాడు. పెద్దావిడ మాధవరావు భార్య అహల్య ఇంకో యువతి స్మిత ఆయన కూతురు అని చూపించాడు.

ఎస్ఐని చూడగానే అహల్య తన ఏడుపు స్వరాన్ని పెంచింది.

''దేవుడిలాంటి ఆయన్ని ఎవరు పొట్టన పెట్టుకున్నారో వాళ్ళకు పుట్టగతులుండవు....'' అంటూ శాపనార్థాలు పెట్టసాగింది.

''ఆయనకెవరైనా శత్రువులున్నారా....?'' అడిగాడు ధనుంజయ్.

''వారం రోజుల క్రితం వరకూ లేరు. ఈ మధ్యే కొత్తగా పుట్టుకొచ్చారు...''

''ఎవరు వాళ్ళు...?''

కళ్ళు తుడుచుకుంటూ స్మిత వైపుకొర కొర చూస్తూ ''పక్కకు రండి...'' ఇంకో గదిలోకి దారి తీసింది అహల్య.

***

''స్మిత రాజేష్ అనే అబ్బాయితో ప్రేమలో పడింది. అతను మన హోదాకు తగ్గవాడు కాదు. నీకు వేరే సంబంధం నిశ్చయం చేస్తానన్నాడు మా ఆయన. ఈ విషయంలో ఇద్దరి మధ్య తరచూ ఘర్షణ జరుగుతూ ఉండేది.

నాలుగు రోజుల క్రితం రాజేష్ డైరెక్ట్‌గా మాధవరావును కలిసి స్మితను ఇచ్చి పెళ్ళిచేయమని అడిగాడు. అందుకు ఆయన ససేమిరా అంగీకరించ లేదు.

దాంతో రాజేష్ కోపంగా మా ఆయన చొక్కా పట్టుకొని రెండు రోజుల్లో నీ అంతు చూస్తానని బెదిరించాడు....నిన్న అన్నంత పనీ చేసాడు'' అంటూ మరోసారి ఘొల్లు మంది అహల్య.

''అతనలా బెదిరించినప్పుడు అక్కడ ఇంకెవరైనా ఉన్నారా...?'' అడిగాడు ధనుంజయ్.

''అందరం ఉన్నాం నేను, స్మిత... మా నౌకరు లింగం, మేనేజరు నారాయణరావు... అందరం అక్కడే ఉన్నాం'' అంది అహల్య.

''అంటే ఖచ్చితంగా ఈ దారుణానికి రాజేషే బాధ్యుడంటారా? మరి మాధవరావు సూసైడ్ నోట్ సంగతి ఏమిటి...'' అడిగాడు ఎస్ఐ.

''అదే నాకూ అర్థం కావడం లేదు..కాకపోతే నిన్న రాత్రి ఇంట్లో నుండి గోడ దూకి పారిపోతుంటే లింగం చూసానని చెబుతున్నాడు...''

అవునా అన్నట్లు లింగం వైపు చూశాడు ఎస్ఐ. అవునన్నట్లుగా తలూపాడు లింగం.

అహల్య దిక్కులు చూస్తూ, ''నాకేమీ తోచడం లేదు. గౌరవంగా బతికే కుటుంబం మాది. కుటుంబ గౌరవం అప్రతిష్ఠ పాలౌతుంటే అవమానాన్ని తట్టుకోలేక ఈ అఘాయిత్యం చేసుకున్నాడేమో....'' అంటూ మళ్ళీ రెండు చేతుల్లో మొహం దాచుకొని ఏడవసాగింది అహల్య.

ఇంక ఆమెను అడిగేదేమీ లేక గదిలోంచి బయ

టకొచ్చాడు ధనుంజయ్.

అక్కడ ఉన్న స్మితను అడిగి రాజేష్ అడ్రస్ తెలుసుకున్నాడు.

శవాన్ని పోస్టుమార్టంకు గాను సివిల్ హాస్పిటల్ పంపించి పోలీస్ స్టేషన్‌కు బయలుదేరారు పోలీసులు.

***


ఎస్ఐ ధనుంజయ్ ఎదురుగా కూర్చొన్న అసిస్టెంట్ వెంకట్. "మాధవరావ్ సూసైడ్ నోట్ చూస్తుంటే మీకేమనిపిస్తోంది....?" అంటూ అడిగాడు.

"అదే నాకూ అర్థం కావట్లేదు. తనకు నచ్చని వాడు అల్లుడుగా వచ్చినంత మాత్రాన తాను ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం లేదు...." అన్నాడు ధనుంజయ్ దీర్ఘంగా ఆలోచిస్తు.

"అసలా సూసైడ్ నోట్ అతను వ్రాయలేదని నా అనుమానం...."

"ఎందుకలా అనుకుంటున్నావు?"

"మాధవరావు డెడ్‌బాడీని చూసారుగా. అతను ఆఫీసు టేబుల్ ముందు కూర్చొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఆ టేబుల్ మీదే లెటర్ పాడ్, పెన్నూ అన్నీ ఉన్నాయి. అలాంటిది సూసైడ్ నోట్ కాగితం మీద రాయకుండా కంప్యూటర్‌లో ఎందుకు ఫీడ్ చేసాడు...?"



వెంకట్ అలా అడగగానే ఆలోచనలో పడ్డాడు ధనుంజయ్.

"నిజమే చేత్తో రాయకుండా సిస్టమ్‌లో ఎందుకు టైప్ చేసినట్లు...చేతి వ్రాతయితే, ఆ వ్రాత ఎవరిదో మనకు తెలిసిపోతుంది...." ఎస్ఐ మాట పూర్తికాకుండానే

"అందుకే ఆ ఏర్పాటు చేసారు..." అన్నాడు వెంకట్.

"అయితే ఇది ఆత్మహత్య కాదు హత్యేనంటావు...ఆ కోణంలో ఆలోచిస్తే మాధవరావు భార్య అహల్య చెప్పినట్లు ఈ హత్య రాజేష్ చేసుండాలి.... కమాన్ రాజేష్ ఇంటికి వెళ్దాం పద" అంటూ దిల్‌సుఖ్ నగర్‌లోని రాజేష్ ఇంటికి బయలుదేరారు ధనుంజయ్, వెంకట్‌లు.

అక్కడికి వెళ్ళేసరికి రాజేష్ ఇంటికి తాళం వేసి ఉంది. ఉస్సూరమంటూ వెనుదిరిగారు.

కాని వెంకట్ మాత్రం "ఒక్క క్షణం సార్..." అంటూ మరోసారి ఇంటి చుట్టూ తిరిగి చూశాడు. అతని అనుమానం నిజమయింది. లోపల లైట్లు వెలుగుతున్నాయి. ఫ్యాన్లు తిరుగుతున్నాయి.

అంటే ఇంటి వెనక వైపు నుండి రాకపోకలు సాగిస్తుండాలి. వెంకట్ ఇంటి వెనుక వైపు చేరి తలుపు మీద నెమ్మదిగా తట్టాడు. "ఆ వస్తున్నా అంటూ..." ఓ యువకుడు తలుపు తీశాడు. వెంకట్ క్షణం ఆలస్యం చేయకుండా యువకుడి చొక్కా పట్టుకుని లాగాడు.

ఆ వెనుకే ఎస్ఐ ధనుంజయ్ కనిపించడంతో నివ్వెరపోయాడాయువకుడు. "నువ్వేనా రాజేష్?" అని అడిగేసరికి అవునన్నట్లుగా తలూపాడు.

"అయితే నడువు..." అంటూ జీపు ఎక్కించారు పోలీసులు.

***

"చెప్పు ఈ హత్య ఎందుకు చేశావ్...?" గద్దించి అడిగాడు ఎస్ఐ ధనుంజయ్.

"నిజంగా ఈ హత్య ఎలా జరిగిందో నాకు తెలియదు...." చెప్పాడు రాజేష్.

"మరయితే ఆ రోజు రాత్రి నువ్వు గోడ దూకి పారిపోవడం చూసానంటున్నాడు లింగం."

"ఆరోజు రాత్రి నేను స్మితని కలుసుకోవడానికని వెళ్ళాను. అక్కడికి చేరుకునేసరికి మాధవరావు ఆఫీసు రూమ్‌లో నిర్జీవంగా పడి ఉన్నాడు. ఆ దృశ్యం చూసిన నేను భయంతో అక్కడి నుంచి పారిపోయాను..." అని చెప్పాడు రాజేష్.

"నువ్వు మాధవరావు అంతు చూస్తాననడం నిజం కాదంటావా?"

"ఏదో ఆవేశంలో అలా అన్నానే కానీ, మనుషుల్ని చంపేటంతటి దుర్మార్గుణ్ణి కాను నేను..." అంటూ తలొంచుకున్నాడు రాజేష్.

"ఇంతకూ అది హత్యా? ఆత్మహత్యా?" అడిగాడు ఎస్ఐ.

"అది హత్యేనని నా అనుమానం...ఎందుకంటే మాధవరావుకూ ఆయన భార్య అహల్యకు మధ్య గొడవలున్నాయి... ఇద్దరి మధ్య స్పర్ధలున్నాయి. ఆయన తన ఆస్తి మొత్తం తన కూతురు స్మిత పేరున రాసారు. అది ఆవిడకు ఇష్టం లేదు...."

"అలా ఎందుకు చేసాడు?"

"అహల్య స్మిత తల్లి కాదు. స్మితకు సవతి తల్లి అంటే మాధవరావు రెండో భార్య. మొదటి భార్య లక్ష్మి స్మిత చిన్నప్పుడే కాలం చేసింది. తనకేదైనా ప్రమాదం జరిగితే స్మితను అహల్య సరిగ్గా చూడదని ఈ జాగ్రత్తలు తీసుకొన్నాడు..."

"ఈ విషయం ఇంకా ఎవరెవరికి తెలుసు?"

"ఇంట్లో సభ్యులందరికీ తెలుసు. మేనేజర్ నారాయణ్ రావుకు కూడా తెలుసు..." చెప్పాడు రాజేష్.

"నారాయణ్‌రావుకు కూడా తెలుసునని ప్రత్యేకంగా చెబుతున్నావెందుకు...?" అడిగాడు వెంకట్.

"అహల్య, నారాయణరావుల మధ్య అక్రమ సంబంధం ఉందని స్మిత చెబుతుండేది..."

అలా మాట్లాడుతూ, టేబుల్ మీద మాధవరావ్ హత్యకు సంబంధించిన ఫోటోలు చూడసాగాడు రాజేష్. అందులో ఓ ఫోటో అతని దృష్టిని ఆకర్షించింది. అదే విషయాన్ని వెంకట్‌కు తెలియజేసాడు. దాన్ని చూస్తూనే,

"మాధవ్‌రావుది ఖచ్చితంగా హత్యే సార్...." అని తేల్చేసాడు వెంకట్.

"అయితే మరోసారి మాధవరావు ఇంటికి వెళ్దాం పద..." అంటూ బయలుదేరాడు ధనుంజయ్.

***

"స్మితా, నీకు ఎవరిమీదైనా అనుమానం ఉందా?" అన్న ధనుంజయ్ ప్రశ్నతో తలెత్తింది స్మిత. కళ్ళల్లో నీళ్ళు నిండి ఉన్నాయి. స్మిత పెదవి విప్పకముందే...

"చిన్నపిల్ల అదేం చెబుతుంది? ఆ రాజేష్ గాడే చేసుంటాడు..." అంటూ అక్కడకు చేరుకున్నాడు మేనేజర్ నారాయణరావు.

"మీరేనా నారాయణరావ్...మరి ఆ ఘోరం జరిగిన రాత్రి మీరెక్కడున్నారు..." అడిగాడు ఎస్ఐ.

"ఓ అర్జంటు ఆఫీసు పని మీద కర్నూల్ వెళ్లాను" అన్నాడు నారాయణరావు.

"ఓ గ్లాస్ మంచినీళ్ళిప్పిస్తారా..." అడిగాడు ఎస్ఐ.

నారాయణరావు నీళ్ళ గ్లాసు అందివ్వగానే, "నేను స్మితతో మాట్లాడాలి మీరు వెళ్ళండి..." అని అతన్ని పంపించాడు ఎస్ఐ.

"రాజేష్ హత్యలు చేసే దుర్మార్గుడు కాడు...." అంటూ కళ్ళు తడుచుకుంది.

"నిజం నిలకడ మీద తేలుతుంది. డోంట్ వర్రీ బేబీ...." అంటూ స్మితకు హామీ ఇచ్చి అక్కడి నుండి నిష్క్రమించాడు ఎస్ఐ. ధనుంజయ్. నారాయణరావు ఇచ్చిన గాజు గ్లాసును జాగ్రత్తగా తీసుకెళ్ళాడు.

***

"ఏయ్ ఏమిటాతొందర రాజేష్ గాడు ఇంకా కటకటాల్లోకి చేరలేదు..." అంటూ తనను కౌగిలించుకోబోతున్న వ్యక్తిని పక్కకు తోసింది ఆ యువతి. "ఇంకా వాడు బయటపడతాడనా నీ భయం. మనం వేసిన ప్లాను ఒక్క దెబ్బకు రెండు పిట్టలు..." అంటూ ఆమెను అల్లుకోబోయాడు. ఇంతలో ధడాల్న తలుపు తెరుచుకోవడంతో నివ్వెరపోయారు వాళ్ళిద్దరు.

ఎస్ఐ ధనుంజయ్. "నీప్లాన్ పారలేదు. ఒక్క దెబ్బకు ఒక్క పిట్టే మిస్టర్ నారాయణ్‌రావు. రాజేష్, మాధవరావుల మధ్య చెలరేగిన విబేధాలు మీకనుకూలంగా మార్చుకొన్నారు. మొదట ఆత్మహత్యగా చిత్రీకరించారు. ఎదురుగా పేపరు, పెన్ను పెట్టుకొని సూసైడ్ నోట్ సిస్టమ్‌లో టైప్ చేయడంతో అనుమానం వచ్చింది మాకు. అందుకే ఆ నేరాన్ని రాజేష్‌పై తోయడానికి ప్రయత్నించారు. అయితే మాధవరావు పిస్టల్‌తో కుడికణత మీద పేల్చుకున్నాడు. కానీ పిస్టల్ ఎడమ చేతిలో ఉంది. అదే మీరు చేసిన పెద్ద పొరపాటు. ఇక హత్య జరిగిన రోజు కర్నూల్‌కు వెళ్ళానన్నావు. కాని జడ్చర్ల దగ్గరి చెక్‌పోస్టులో నీ కారు నెంబర్ లేదు. ఈ రెండు రోజులు సిటీలోనే ఎక్కడో అజ్ఞాత వాసం చేసావు. ఇక పిస్టల్ మీద వేలి ముద్రలు నీవే.... ఈ సాక్ష్యాలు చాలా...?" అంటూ ఆగాడు ధనుంజయ్.

అహల్య, నారాయణరావులను అరెస్ట్ చేసారు. రాజేష్ నిర్దోషిగా బయటపడ్డాడు.

రాజేష్, స్మితలు ఎస్ఐ ధనుంజయ్‌కు కృతజ్ఞతలు తెలియజేసారు.



*